





12వ తేదీ ఉదయం మెడికల్ కాలేజీలో ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్న గైనకాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ రేణుక, ఆమె భర్త అనస్థీషియా విభాగం అసోసియేట్ ప్రొఫెసర్

లోపల పంచ్.. బయట బెంచ్..!

డ్యూటీ రోస్టర్ మేరకు ఫలానా డాక్టర్ ఆరోజు విధుల్లో ఉంటారని భావించి, వారితో చికిత్స చేయించుకోవాలని వస్తే ఆ వైద్యుడు కనిపించడం లేదని రోగులు వాపోతున్నారు. ఇదే విషయంపై కళాశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నిస్తే 'ఎక్కడున్నారో మీరే వెతికి పట్టుకోండి' అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని

మీరే వెతుక్కోండి

రోగులు మండిపడుతున్నారు. కాగా ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్న డాక్టర్ల అంశంపై ప్రిన్సిపాల్ విజయశ్రీని వివరణ కోరగా ఎఫ్ఆర్ఎస్ ఎక్కడైనా వేయవచ్చని సమాధానం చెప్పారు. అయితే ఇది ఎన్ఎంసీ నిబంధనలకు విరుద్ధం కావడం గమనార్హం.

- సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ యూనిట్‌లో విధులు
- కాలేజీలోనే ఎఫ్ఆర్ఎస్ వేస్తున్న వైద్యులు
- పర్యవేక్షణ కొరవడటం వల్లే సమస్యలు

• పెద్దాస్పత్రిలో డ్యూటీలకు డాక్టర్ల డుమ్మా..! • ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్న కొందరు

అనంతపురం వైద్యం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పెద్దాస్పత్రి డాక్టర్లు కొందరు డ్యూటీలకు డుమ్మా కొడుతున్నారు. విధులకు వచ్చినట్లు ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్)ను వేసి వెళ్లిపోతున్నారు. టీచింగ్ ఫ్యాకల్టీలోని ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు పీజీ విద్యార్థులు మొత్తం 539మంది ప్రభుత్వ వైద్యవిద్యకళాశాల పరిధిలో పని చేస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు విధులు నిర్వర్తించాలి. ఉదయం 9.10గంటల్లోపు ఎంట్రీ ఎఫ్ఆర్ఎస్, సాయంత్రం 4గంటలపైన ఎగ్జిట్ ఎఫ్ఆర్ఎస్ వేయాలని నిబంధన పెట్టారు. విధించిన సమయానికి అరగంట సమయం వెసులుబాటును కల్పించి ఎఫ్ఆర్ఎస్‌కు లాక్ పెట్టలేదు. ఇదే అదనుగా కొందరు డాక్టర్లు ఉదయం 6గంటల నుంచి 9గంటలలోపు ఎంట్రీ ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్నారు. అనంతరం సాయంత్రం 4గంటలపైన వచ్చి ఎగ్జిట్ ఎఫ్ఆర్ఎస్‌ను వేస్తున్నారు. డ్యూటీ లోకేషన్‌ను ఫిక్స్ చేయకపోవడంతో వైద్యవిద్య కళాశాలలోనే ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్నారు.

ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలో బాధ్యతగా పనిచేయాల్సిన కొందరు డాక్టర్లు పని దొంగలుగా మారిపోయారు. ఎవరికి వారే సొంతంగా ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు డయాగ్నస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేసుకుని వాటిలో పని చేసేందుకు అధిక సమయం, ప్రాధాన్యం ఇస్తున్నారు.

పర్యవేక్షణ ఏదీ?

ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ రావడంతో కనీసం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకైనా ప్రభుత్వ విధుల్లో ఉండి వైద్యసేవలందిస్తారని రోగులు భావించారు. కానీ అది నెరవేరడం లేదు. ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని తీసుకువచ్చినా పర్యవేక్షణ లోపం వల్ల ఎవరికి వారుగా జారుకుంటున్నారు. డ్యూటీలు సక్రమంగా చేసే డాక్టర్లు మాత్రం ఉదయం 9 నుంచి 9.30గంటల్లోపు ఎఫ్ఆర్ఎస్ వేసి విధుల్లో ఉండిపోతున్నారు. అయితే అరగంట ఎందుకు ఆలస్యంగా వస్తున్నారని వీరికి అధికారులు చీవాట్లు పెడుతున్నారు.



జనరల్ సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుసూదన్‌రెడ్డి

నాలుగు జీపీఎస్ పాయింట్లు...

ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలో పనిచేస్తున్న డాక్టర్లు, పీజీ విద్యార్థుల హాజరును లెక్కించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) దేశవ్యాప్తంగా ఈ ఏడాది ప్రారంభం నుంచి ఎఫ్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టింది. గతంలో బయోమెట్రిక్ ద్వారా హాజరు విధానం ఉండేది. ఈ డేటా రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత కళాశాలకే పరిమితమయ్యేది. దేశంలోని అన్ని వైద్య కళాశాలల హాజరును లెక్కించేందుకు జీపీఎస్ ద్వారా అటెండెన్స్‌ను తీసుకునేలా ఆన్‌లైన్ ఎఫ్ఆర్ఎస్‌ను ప్రవేశపెట్టింది. మొబైల్ యాప్‌ను రూపొందించి సంబంధించిన వారికి లాగిన్ ఐడీ కేటాయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల, వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, క్యాన్సర్ యూనిట్ ఒక్కొక్కటిగా నాలుగు పాయింట్లను జీపీఎస్ లోకేషన్‌కు అనుసంధానం చేశారు. ఒక్కో పాయింట్‌కు 30నుంచి 50 మీటర్ల పరిధిలో లోకేషన్‌ను ఫిక్స్ చేశారు. దీని ప్రకారం వైద్యులు డ్యూటీలు చేస్తున్న లోకేషన్‌లోనే ఎఫ్ఆర్ఎస్‌ను వేయాలి. అయితే డాక్టర్లు డ్యూటీలు చేస్తారన్న నమ్మకంతో నాలుగు లోకేషన్లు ఎఫ్ఆర్ఎస్‌కు అనుసంధానం చేశారు. ఎన్ఎంసీ నమ్మకాన్ని వమ్ముచేస్తూ మెడికల్ కాలేజ్‌లో ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోతున్నారు.

బహిరంగమే అయినా

డాక్టర్లు సక్రమంగా డ్యూటీలు చేయడం లేదన్న విషయం బహిరంగ రహస్యమే. వారిని కట్టడి చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. 539మంది ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్‌ను వారానికి ఒకసారి పరిశీలించాలి. ఉదయం ఎన్నిగంటలకు ఎఫ్ఆర్ఎస్ వేస్తున్నారు. సాయంత్రం ఎన్నింటికి ఎఫ్ఆర్ఎస్‌వేసి పోతున్నారో ఆన్‌లైన్ డేటాను తీయాలి. కళాశాలలోని డిపార్ట్‌మెంట్స్ డాక్టర్లు సంబంధిత లోకేషన్‌లోనే ఎఫ్ఆర్ఎస్ వేస్తున్నారా?. వైద్యశాల, సూపర్ స్పెషాలిటీ, క్యాన్సర్ యూనిట్‌లో డ్యూటీ చేయాల్సిన డాక్టర్లు ఆయా లోకేషన్లలో ఎఫ్ఆర్ఎస్‌ను ఎందుకు వేయడంలేదు? అన్నది గమనించాలి. సక్రమంగా డ్యూటీ చేయని వైద్యులను ప్రశ్నించాలి. ఇలా ఎప్పటికప్పుడు జరుగుతూ ఉంటే వైద్యుల్లో కొంతైన బాధ్యత పెరిగే అవకాశం ఉంటుందని ఆస్పత్రి వచ్చే రోగులు, వారి సహాయకులు పేర్కొంటున్నారు.

నేడు రైతుల ఖాతాల్లోకి సొమ్ము

అనంతపురం అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల కానుంది. బుధవారం కడప జిల్లా కమలాపురంలో జరిగే కార్యక్రమానికి సీఎం చంద్రబాబునాయుడు హాజరై, అన్నదాత సుఖీభవ సొమ్మును విడుదల చేయనున్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ పీఎం కిసాన్ సొమ్మును విడుదల చేయనున్నారు. జిల్లాలోని 2,75,642 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.137.82 కోట్లు విడుదల కానుంది. 2,55,813 మంది రైతులకు రూ.51.16 కోట్ల పీఎం కిసాన్ సొమ్ము విడుదల చేయనున్నారు. మొత్తం రూ.188.98 కోట్లు జమకానుంది.

రెండో విడత...

ఏటా మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమ చేయాలని నిర్ణయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.14వేలు, కేంద్రం నుంచి రూ.6వేలు జమ చేయనున్నారు. ఈ ఏడాది ఆగస్టు 2వ తేదీన తొలి విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు చొప్పున జమ చేశాయి. బుధవారం రెండో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు, కేంద్రం రూ.2వేలు విడుదల చేయనున్నాయి. మిగిలిన సొమ్మును మూడో విడతలో రాష్ట్ర ప్రభుత్వం రూ.4వేలు, కేంద్రం రూ.2వేలు జమ చేయనున్నాయి.

రైతు సేవాకేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం

జిల్లాలోని అన్ని రైతు సేవాకేంద్రంలో అన్నదాత సుఖీభవ విడుదల ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదల అంశంతోపాటు వ్యవసాయ రంగంలో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను వివరించనున్నారు. ప్రతి నియోజకవర్గ కేంద్రంలో అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు.



జూమ్ మీట్‌లో మాట్లాడుతున్న అధికారులు

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి: పీఆర్ ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇప్పటికే అనుమతి పొందిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాల పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పంచాయతీ రాజ్ ఎస్ఈ కార్యాలయం నుంచి ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు, డ్వామా పీడీ సలీం బాషా సంయుక్తంగా గ్రామ పంచాయతీ భవనాలు మంజూరైన మండల అభివృద్ధి అధికారులు, సిబ్బందితో జూమ్ మీట్ నిర్వహించారు. మొత్తం 27 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి అనుమతులు మంజూరయ్యాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించగా.. ఆరుచోట్ల పంచాయతీ భవనాలున్నాయి. మరో రెండు ప్రాంతాల్లో ముంపునకు గురయ్యే ప్రాంతంలో ఉండటంతో వాటిని రద్దు చేశారు. మిగిలిన 19 భవనాల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అన్నిచోట్లా పనులు ప్రారంభించి, వేగవంతంగా నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.



రామానుజ జీయర్ స్వామి గిరి ప్రదక్షిణ



శివపార్వతులు, లక్ష్మీవెంకటేశ్వరుల కల్యాణోత్సవాలు



అనుగ్రహభాషణం చేస్తున్న స్వామీజీ

కోటి దీప కాంతులు..!

- అనంతలో అరుణాచల గిరిప్రదక్షిణ
- శివనామ స్మరణతో పులకించిన భక్తులు



కోటి దీపోత్సవంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని అనంత కోటి దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో లలితకళా పరిషత్‌లో మంగళవారం సాయంత్రం కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు. విజయవాడ అష్టాక్షరి పీఠానికి చెందిన త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులకు కార్తీక పురాణంపై అనుగ్రహభాషణం చేశారు. అరుణాచలం వెళ్లలేని భక్తుల కోసం పరిషత్ ఆవరణలో అరుణాచల గిరి నమూనాను ఏర్పాటు చేశారు. వందలాది మంది భక్తులు గిరి ప్రదక్షిణ చేసి తన్మయత్వం పొందారు. కార్యక్రమంలో కోటి దీపోత్సవ సమితి అధ్యక్షుడు వెంకటేష్ గుప్త, ఉపాధ్యక్షుడు సందీప్ గుప్త, ప్రధాన కార్యదర్శి విజయసాయికుమార్, కోశాధికారులు వేణుగోపాల్, అంబటి రాజు, సభ్యులు సత్రసాల మంజునాథ్, ముడియం రమణ, సత్రసాల నాగేంద్ర, సత్యనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని నాణ్యంగా నిర్మించాలి: కలెక్టర్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యతగా వంతెన నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆనంద్.. పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు, పీఐయూ ఈఈ శ్రీరాములుతో కలిసి పెద్దవడుగూరు మండలంలోని వీరన్నపల్లి వద్ద నిర్మిస్తున్న పుల్లేటి వంతెనను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎస్ఈ చిన్న సుబ్బరాయుడుతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉషారాణి పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్ఈ

సామాజిక న్యాయానికి పాతర

- జనగణనతోపాటు కులగణన చేపట్టాలి
- సీపీఐ నేత జగదీష్ డిమాండ్



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో సామాజిక న్యాయానికి పాతర వేశారనీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఆదివాసీలపై దాడులు పెరిగిపోయాయని సీపీఐ రాష్ట్ర నేత జగదీష్ పేర్కొన్నారు. దాడులను నిరసిస్తూ మంగళవారం జిల్లాకేంద్రంలో సీపీఐ భారీ నిరసన ర్యాలీ చేపట్టింది. ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. అక్కడ నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. జగదీష్ మాట్లాడుతూ.. దళిత, గిరిజన, ఆదివాసీలు, మహిళలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. జనగణనతోపాటే కులగణన చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర నేత జాఫర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, నాయకులు పాల్గొన్నారు.

సెల్‌క్షేపం..!



ఇది బొమ్మనహాళ్ ఎంపీడీఓ కార్యాలయం. ఆశీనులైన వారంతా ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు. గ్రామాల అభివృద్ధికి కృషి చేయాల్సినవారే. గ్రామాల్లో పచ్చదనం పెంపు, పరిశుభ్రత పరిరక్షణపై వారికి ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగా బొమ్మనహాళ్‌లో కూడా మంగళవారం ఏర్పాటు చేశారు. మహిళా సర్పంచ్‌ల స్థానంలో వారి భర్తలు, బంధువులు కూడా హాజరయ్యారు. పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. స్క్రీన్‌పై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమానికి హాజరైన చాలా మంది ఇదిగో.. ఇలా.. సెల్‌ఫోన్ చూసుకుంటూ కాలక్షేపం చేస్తూ కనిపించారు. గ్రామాల అభివృద్ధికి సంబంధించిన శిక్షణలో సర్పంచ్‌లు, కార్యదర్శుల నిర్లక్ష్యంపై జనం విమర్శలు గుప్పిస్తున్నారు.

- బొమ్మనహాళ్, ఆంధ్రజ్యోతి

వెండిరథంపై

బంగారు సాయి

వైభవంగా సత్యసాయి నారాయణ రథోత్సవం

- వేలాదిగా హాజరైన భక్తులు..
- పులకించిన పుట్టపర్తి



సత్యసాయి రథోత్సవం, ఇన్‌సెట్‌లో స్వర్ణసాయి

పుట్టపర్తి, టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలు కన్నుల పండువగా సాగుతున్నాయి. సాయికుల్వంతులో వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీసాయి సత్యనారాయణ సామూహిక వ్రతాలను నిర్వహించారు. సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పుట్టపర్తిలో మంగళవారం అశేష భక్తులనడుమ సత్యసాయి నారాయణ రథోత్సవం జరిగింది. సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి స్వర్ణ విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వర్ణ విగ్రహాన్ని, వేణుగోపాలస్వామి, సీతారాముల ఉత్సవ మూర్తులను గోపురం వద్దకు తోడ్కొని వచ్చి వెండి రథంపై కొలువుదీర్చారు. సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ హారతి ఇచ్చి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు విద్యార్థులు వేదమంత్రాలు పఠిస్తూ నడవగా, వారి వెనుక మంగళవాయిద్యాలు, భజనలు, కోలాటం, గురవయ్యల నృత్యం, దేవతా వేషధారణలో చిన్నారులు కదిలారు. ఈ వేడుకను చూసేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సత్యసాయి రథోత్సవంలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ భక్తులు తమ తమ ప్రాంతాల సంప్రదాయ నృత్యాలతో అలరించారు. రథోత్సవంపై డ్రోన్ కెమరాతో పూల వర్షం కురిపించారు. పెద వెంకమరాజు కల్యాణ మండపానికి చేరుకున్న అనంతరం రథానికి రత్నాకర్, వేద పండితులు మంగళహారతి ఇచ్చి రథోత్సవాన్ని ముగించారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరా రెడ్డి, మాజీ ఎంపీ మురళీ మోహన్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, టీడీపీ

(మిగతా 6వ పేజీలో..)

నేడు ప్రధాని మోదీ రాక

- హిల్ వ్యూ స్టేడియంలో వేడుకలు
- సత్యసాయి సన్నిధిలో సచిన్, ఐశ్వర్యా రాయ్
- పుట్టపర్తికి చేరుకున్న సీఎం, డిప్యూటీ సీఎం, లోకేశ్





సీఎంకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ శ్యాంప్రసాద్, మంత్రులు

పుట్టపర్తి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ పుట్టపర్తికి బుధవారం వస్తున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు. ప్రధాని ఉదయం 9.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. గవర్నర్ (మిగతా 6లో..)

బుగ్గ రామలింగేశ్వరుడికి లక్ష బిల్వార్చన



బిల్వ పత్రాల నడుమ స్వామివారు

తాడిపత్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, అర్చనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు.. స్వామివారిని దర్శించకున్నారు.

గొర్రెలను కాపాడేందుకెళ్లి..
కిందపడి కాపరి మృతి

విషపు నీరు తాగి 24 మూగజీవాలు కూడా..


రామాంజినమ్మ (ఫైల్)

బెళుగుప్ప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విషం కలిపిన నీటిని తాగుతున్న గొర్రెలు, మేకలను కాపాడే ప్రయత్నంలో కాపరి బోర్లాపడి మరణించింది. మండలంలోని దుద్దేకుంట గ్రామం వద్ద మంగళవారం రామాంజినమ్మ(40) చనిపోయింది. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓబులేసు, రామాంజినమ్మ దంపతులకు 45 గొర్రెలు, మేకలు ఉన్నాయి. వాటిని మేపుకుంటూ జీవనం సాగించేవారు. మంగళవారం గ్రామ సమీపంలోని వన్నూరు స్వామి తోట వద్దకు మూగజీవాలను రామాంజినమ్మ తోలుకెళ్లింది. తోటలోని అరటి చెట్లకు పిచికారీ చేసేందుకు క్రిమి సంహారక మందులు కలిపి, డ్రమ్ములో నిల్వ ఉంచారు. మూగజీవులు మేత మేస్తూ దాహంతో ఆ నీరు తాగాయి. దీనిని గమనించిన రామాంజినమ్మ.. అవి చనిపోతాయన్న భయంతో పరుగులు తీసింది. పరుగెడుతూ బోర్లాపడి సొమ్మసిల్లి పడిపోయింది. కుటుంబ సభ్యులు రామాంజినమ్మను ఆత్మకూరు ఆస్పత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో చనిపోయింది. 45 గొర్రెలు, మేకలుకు ఉండగా 24 చనిపోయాయి. దీంతో రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. రామాంజినమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

29న జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఎన్నికలు ఈనెల 29వ తేదీన ఆర్డీటీ స్టేడియంలోని ఏడీసీఏ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి భీమలింగారెడ్డి మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికల అధికారి రిటైర్డ్ ఆర్డీఓ ఈశ్వర్ పర్యవేక్షణలో సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈనెల 24వతేదీన నామినేషన్లు స్వీకరిస్తారన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతపురం రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లిరోడ్డులోని ఏఫ్ ఎకాలజీ సెంటర్‌లో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాపరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాను రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సీడాప్, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యం నిర్వహిస్తున్నామన్నారు. జాబ్‌మేళాలో పది కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. పదో తరగతిపైన చదివి, 18 నుంచి 35ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీయువకులు మేళాకు హాజరుకావచ్చన్నారు. వివరాలకు 9010039901 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వక్కలారీల పట్టివేత

అనంతపురం కలెక్టరేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ అధికారుల తనిఖీలో నాలుగు వక్కల లారీలు పట్టుబడ్డాయి. గుత్తి టోల్ గేట్ వద్ద కర్ణాటక నుంచి వక్కలతో వస్తున్న ఈ వాహనాలను అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశారు. సరుకు విలువ రూ.4కోట్ల నుంచి రూ.5కోట్ల వరకు ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఇందుకూరు హేమ తెలిపారు. కాగా తనిఖీ చేసిన సందర్భంలో కాకుండా కొంత ఆలస్యంగా వే బిల్లులు అధికారులకు చూపించినట్లు తెలిసింది. మరి ఈ విషయంలో అధికారులు వక్కల జరిమానా విధిస్తారా..?లేక వే బిల్లు ఉన్న కారణంగా నిబంధనల మేరకు వదిలేస్తారా..?అనేది తేలాల్సి ఉంది.

హంద్రీనీవా కాలువ అభివృద్ధికి నాబార్డు రుణం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ అభివృద్ధి పనులకు రుణం ఇవ్వనున్నట్లు నాబార్డు ప్రాంతీయ అధికారి కావ్య తెలిపారు. హంద్రీనీవా ఎస్ఈ రాజాస్వరూప్‌తో కలిసి ఆమె రెండురోజులపాటు ఉమ్మడి జిల్లాలో హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులను పరిశీలించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. మొత్తం నాబార్డు ద్వారా రూ.2100 కోట్ల రుణం ఇస్తామన్నారు. ఇప్పటికే రూ.1150 కోట్లు విడుదల చేశామన్నారు. త్వరలో మరో రూ.950కోట్లు ఇచ్చి, కాలువ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు కార్యక్రమంలో నాబార్డు కన్సల్టెంట్ కేశవయ్య, హంద్రీనీవా ఈఈలు శ్రీనివాస నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైద్యసేవే పరమావధి కావాలి

నూతన వైద్యవిద్యార్థులకు కలెక్టర్ సూచన


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం వైద్యం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): వైద్యసేవే పరమావధి కావాలని ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కలెక్టర్ ఆనంద్ సూచించారు. ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య కళాశాల, సర్వజనాస్పత్రి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. వైద్యులందరూ సమయానికి విధుల్లో ఉండాలనీ, రోగుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు షారోన్ సోనియా పాల్గొన్నారు.


సత్యసాయి రథోత్సవం ముందు సాంస్కృతిక కార్యక్రమాలు


జయంత్యుత్సవాలకు హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


రథానికి పూజలు చేస్తున్న రత్నాకర్




రథాన్ని లాగుతున్న మంత్రులు


సత్యసాయి మహాసమాధి

వెండి రథంపై బంగారు సాయి

(5వ పేజీ తరువాయి)
జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

మహిళల ద్వారా సమాజానికి సంస్కృతిని, సేవలను, ఆధ్యాత్మికతను పంచేందుకే సత్యసాయి 30 ఏళ్ల క్రితం, 1995లో శ్రీసత్యసాయి అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ప్రారంభించారు. ఏటా నవంబరు 19న అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది సెంట్రల్ ట్రస్టు ఆధ్వర్యంలో 30వ అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని హిల్‌వ్యూ స్టేడియంలోనే నిర్వహిస్తున్నారు. దేశవిదేశాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఈ క్యార్యక్రమానికి హాజరుకానున్నారు.

హిల్‌వ్యూ స్టేడియం ముస్తాబు

హిల్ వ్యూ స్టేడియంలో బుధవారం జరిగే సత్యసాయ శత జయంతి వేడుకలు, అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. వీవీఐపీలు కూర్చునేందుకు ఒక వేదిక, సాంస్కృతిక ప్రదర్శనలకు మరో వేదికను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం స్టేడియంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషులకు వేర్వేరు గ్యాలరీలను ఏర్పాటు చేశారు. భక్తులు, అతిథులకు నారాయణ సేవ, తాగునీరు, వైద్యం, రవాణా.. ఇలా అన్ని సౌకర్యాలను కల్పించారు.

అలరించిన సురాంజలి

సత్యసాయి భక్తులు సురాంజలి పేరిట నిర్వహించిన సంగీత కచేరి భక్తులను అలరించింది. సాయికుల్వంతు సభా మంటపంలో మంగళవారం రాత్రి అభి, కుమారి అంతరానంది బృందం సంగీత గాన కచేరి నిర్వహించింది. అనంతరం ట్రస్టు ప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు. సత్యసాయి ప్రేమతత్వంపై విద్యార్థులు భక్తిగీతాలను ఆలపించారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు నారాయణ సేవను అందించారు.



నేడు ప్రధాని మోదీ రాక


మంత్రి లోకేశ్‌తో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ కరచాలనం


సత్యసాయి మహాసమాధి వద్ద నటి ఐశ్వర్యారాయ్

(5వ పేజీ తరువాయి)
అబ్దుల్ నజీర్, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు ఆయనకు స్వాగతం పలుకుతారు. మధ్యాహ్నం 12.25 గంటల వరకూ వేడుకలలో పాల్గొంటారు. అనంతరం కోయంబత్తూరుకు వెళతారు. ప్రధాని పర్యటనకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. పుట్టపర్తికి వెళ్లే అన్ని మార్గాలను పోలీసులు తమ అధీనంలోకి తీసుకున్నారు.

- సత్యసాయి స్మారకంగా రూ.100 నాణేన్ని, నాలుగు తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరిస్తారు. వంద మంది రైతులకు పాడి ఆవులను పంపిణీ చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదేళ్లలోపు బాలికలకు ఆర్థిక భరోసానిచ్చే బృహత్తర పథకాన్ని ప్రారంభిస్తారు. విద్య, వైద్య, సామాజిక రంగాల్లో సేకు సంబంధించిన మరో ప్రధానమైన పథకాన్ని ప్రధాని చేత సత్యసాయి సెంట్రల్ ట్రస్టు ఆవిష్కరించే అవకాశం ఉంది.
- హిల్ వ్యూ స్టేడియంలో నిర్వహించే వేడుకలలో సుమారు 500 మంది వీవీఐపీలు పాల్గొంటారు. సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యారాయ్, మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ తదితరులు ఇప్పటికే పుట్టపర్తికి చేరుకున్నారు.
- భద్రత కట్టుదిట్టం

శత జయంతి ఉత్సవాలకు బుధవారం లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా. ఈ నేపథ్యంలో అధికారులు, పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాని పర్యటన ముగిసేదాకా పుట్టపర్తికి వచ్చే వాహనాలను బ్రహ్మణపల్లి, ఎనుములపల్లి, పడమర గేట్ మీదుగా మళ్లించారు. అనంతరం యథావిధిగా రాకపోకలు సాగించవచ్చు. కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ మౌర్య భరద్వాజ్, ఎస్పీ సతీశ్ కుమార్, ట్రస్టు ప్రతినిధులు చక్రవర్తి, నాగానందం, ప్రసాద్, డాక్టర్ మోహన్, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్ పాండే, కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, ఉమ్మడి రాష్ట్రాల అధ్యక్షుడు చలం, తెలంగాణ అధ్యక్షుడు వెంకట్రావు, ఏపీ అధ్యక్షుడు లక్ష్మణరావు సహా పలువురు సేవాదళ్ ప్రతినిధులు వేడుకలను పర్యవేక్షిస్తున్నారు.

- ఘన స్వాగతం

సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ మంగళవారం సాయంత్రం పుట్టపర్తికి చేరుకున్నారు. విమానాశ్రయంలో వారికి రెవెన్యూ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, చీఫ్ సెక్రటరీ విజయానంద్, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, ఎమ్మెల్యేలు పల్లె సింధూరా రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఆర్టీసీ జోనల్ చైర్మెన్ పూల నాగరాజు, మాజీ మంత్రి పల్లెరఘునాథ రెడ్డి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టీడీపీ జిల్లా అధ్యక్షులు కొల్లకుంట్ల అంజనప్ప, వెంకటశివుడు యాదవ్ తదితరులు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి షాదీ మహాల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్ హౌస్‌లో బసచేశారు. మంత్రి లోకేశ్ కప్పలబండ పారిశ్రామిక వాడలో ఏర్పాటు చేసిన టెంట్ హౌస్‌లో బసచేశారు.


సుప్రీంకోర్టు రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణతో మాట్లాడుతున్న మంత్రులు లోకేశ్, అనగాని, పయ్యావుల

ఇది ఆత్మగౌరవ సీమ..!

రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవంలో నాయకులు


పప్పూరు రామాచార్యులు విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు

అనంతపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ విద్యావంతుల వేదిక, ప్రజా కళామండలి సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని పప్పూరు రామాచార్యులు విగ్రహం వద్ద మంగళవారం సాయంత్రం రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసమితి అధ్యక్షుడు టీవీ రెడ్డి పప్పూరు రామాచార్యులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమితి నాయకుడు రామాంజనేయులు కేక్ కట్‌చేసి, కార్యక్రమానికి 97వ రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవంగా నామకరణం చేశారు. నేడు రాయలసీమగా మనం పిలుచుకుంటున్న ఈ ప్రాంతాన్ని 1928కి ముందు దత్తమండలాలు అని పిలిచేవారని నాయకులు గుర్తు చేశారు. ఆత్మగౌరవానికి, తెగువకు, సాహసానికి పెట్టింది పేరు అయిన ఈ ప్రాంతాన్ని దత్త మండలాలు అని పిలవడం సరికాదని భావించిన ఆ నాటి నాయకులు చిలుకూరి నారాయణరావు.. సీమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా కొత్త ప్రతిపాదనను తెచ్చారని అన్నారు. 1928లో నంద్యాలలో నిర్వహించిన ఆంధ్ర మహాసభ సమావేశంలో దత్త మండలాలు పేరుకు బదులుగా రాయలసీమ అనే పేరుతో పిలవాలని ప్రతిపాదించారని అన్నారు. ఆయన ప్రతిపాదనను ఆమోదించేలా మాడభూషి హరిసర్వోత్తమరావు కృషి చేశారని అన్నారు. ఆ నాటి నుంచి ఏటా నవంబరు 18న రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి, స్టార్ యూత్ ఫెడరేషన్ నాయకులు విశ్వనాథవర్మ, కులనిర్మూలన పోరాట సమితి నాయకుడు నల్లప్ప, సీపీఐ లిబరేషన్ నాయకుడు వేమన, ఐసా నాయకుడు అల్తాఫ్, ఓపీడీఆర్ జిల్లా నాయకుడు ప్రకాష్, రాయలసీమ విద్యార్థి నాయకులు సాయి, సునీల్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై కఠిన చర్యలు

డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

గుంతకల్లు ఏరియా ఆస్పత్రి సిబ్బందికి మెమోలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు సంభవిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈర్ల భ్రమరాంబికాదేవి హెచ్చరించారు. డి.హీరేహాళ్‌కు చెందిన షేక్ తస్లీమాభాను, గడేహోతూరుకు చెందిన కవిత మాతృమరణాలపై మంగళవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యశాల అనస్థీషియా ప్రొఫెసర్ నవీన్‌కుమార్, పీడియాట్రిక్ ప్రొఫెసర్ రవికుమార్, గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ నిస్సార్ బేగంతోపాటు డీపీఎంఓ శ్రీనివాస రెడ్డి, పీఓఎస్‌డీ డాక్టర్ నారాయణస్వామి, హెచ్‌ఎన్‌ఓ ప్రమీలాదేవి ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులతో సమీక్షించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. మాతాశిశుమరణాల కారకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కవిత మరణానికి సంబంధించి గుంతకల్లు ఏరియా ఆస్పత్రి మెటర్నిటీ అసిస్టెంట్లు, స్టాఫ్‌నర్స్‌కు మెమోలు జారీచేయాలని డీసీహెచ్‌ఎస్‌కు సూచించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

ఘనంగా టీడీపీ అర్బన్ క్లస్టర్, బూత్, డివిజన్ ఇన్‌చార్జిల ప్రమాణ స్వీకారం


కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు కష్టమొస్తే... అండగా ఉంటానని అనంతపురం ఎమ్మెల్యే దుగ్గపాటి వెంకటేశ్వరప్రసాద్ భరోసా ఇచ్చారు. ఎప్పుడైనా తనను సంప్రదించవచ్చనీ, చిన్నచిన్న పొరబాట్లు ఉన్నా సరిదిద్దుకుని ముందుకెళ్దామన్నారు. నగరంలోని బళ్లారి బైపాస్ రోడ్డులోగల ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ అనంతపురం అర్బన్ నియోజకవర్గ క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ, మండల ఇన్‌చార్జిల ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. టీడీపీ జోన్ 5 ఇన్‌చార్జి, గుంటూరు మేయర్ రవీంద్ర, అర్బన్ పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్బన్‌లో పార్టీ గెలుపునకు కష్టపడిన వారికి శిరసు వంచి నమస్కరిస్తున్నారన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టమొచ్చినా ఆదుకునేందుకు ముందుంటానన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ... మేయర్ ఎన్నికల్లో అందరూ కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఏపీ మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రకాష్ నాయుడు మాట్లాడుతూ... పసుపు చొక్కా వేసుకుని పనిచేస్తుంటే... వచ్చే ఆనందమే వేరన్నారు. తర్వాత 12 మంది క్లస్టర్లు, 12 మంది కో-క్లస్టర్లు, 56 మంది యూనిట్ ఇన్‌చార్జిలు, 56మంది కో-యూనిట్ ఇన్‌చార్జిలు, 277 మంది యూత్ కమిటీ సభ్యులతో జిల్లా అధ్యక్షుడు వెంటకశివుడు యాదవ్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, వందలాది మంది టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొలంలో కృష్ణుడి విగ్రహం లభ్యం



గాండ్లపెంట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లికి చెందిన వెంకటనారాయణ రెడ్డి పొలంలో శ్రీకృష్ణుడి రాతి విగ్రహం మంగళవారం బయటపడింది. పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా విగ్రహం బయటపడింది. ట్రాక్టర్ ట్రిల్లర్ తగిలి విగ్రహం మధ్యలోకి విరిగిపోయింది. పెద్దలతో చర్చించి, విగ్రహాన్ని ఏం చేయాలన్న దానిపై నిర్ణయం తీసుకుంటామని గ్రామస్థులు తెలిపారు.

మోదీకి సీమలో పర్యటించే హక్కు లేదు

రాయలసీమ రాష్ట్రసమితి వ్యవస్థాపకుడు డాక్టర్ కుంచం

అనంతపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు న్యాయం చేయలేని ప్రధాని మోదీకి ఈ ప్రాంతంలో పర్యటించే హక్కు లేదని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆర్టికల్-3 ప్రకారం ప్రత్యేక బిల్లు ప్రవేశపెట్టి రాయలసీమను ప్రత్యేక రాష్ట్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విలేకరుల సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీకి పంపిన బహిరంగ లేఖను ఆయన విడుదల చేశారు. కుంచం మాట్లాడుతూ.... చిన్న రాష్ట్రాలకు మద్దతు తెలుపుతున్నట్లు బీజేపీ కాకినాడలో తీర్మాణం చేసిందనీ, ఆ మాటను నిలుపుకోలేదని విమర్శించారు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం అంశాన్ని పార్లమెంటులో ఏపీ పాలకులు ఎందుకు ప్రస్తావించడంలేదని ప్రశ్నించారు. రాయలసీమకు ఏం చేశారని ప్రధాని మోదీ పుట్టపర్తి పర్యటనకు వస్తున్నారంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. రాయలసీమలో ఉండాల్సిన పరిశ్రమలన్నింటినీ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న మోదీకి ఈ ప్రాంతంలో పర్యటించే హక్కులేదన్నారు. రాయలసీమకు స్టీల్ ప్లాంట్, రాజధాని వంటివేవీ ఇవ్వకుండా ఈ ప్రాంత ప్రజలకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ పుట్టపర్తికి వస్తున్న తరుణంలో ఇప్పటికైనా కూటమి నేతలు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి, ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. 2029లోపు ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేయకపోతే.. 2029 ఎన్నికల్లో ఏ పార్టీకీ రాయలసీమ వాసులు మద్దతు తెలపకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో రాయలసీమ రాష్ట్ర సమితి మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకుడు సాదర్ వలి, జిల్లా నాయకుడు ముస్కిన్ పాల్గొన్నారు.


లేఖను విడుదల చేస్తున్న కుంచం

సీఎం, లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు




సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్రైం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌ను అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ కలిశారు. సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు మంగళవారం రాత్రి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పుట్టపర్తి చేరుకున్నారు. దీంతో పుట్టపర్తి విమానాశ్రయంలో ప్రజా ప్రతినిధులు వారిని మర్యాదపూర్వకంగా కలిశారు.



సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ఉన్నత విద్య చదవడానికి అనుమతించండి

డీఈఓకు ఎంఈఎఫ్ నేతల వినతి

అనంతపురం విద్య, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఇన్‌సర్వీస్ టీచర్లు ఉన్నత విద్య అభ్యసించడానికి జీఓ మేరకు అనుమతులు ఇవ్వాలని ఎంఈఎఫ్ నేతలు విజ్ఞప్తి చేశారు. మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎంఈఎఫ్) జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్, జిల్లా అధ్యక్షుడు రమేష్ డీఈఓ ప్రసాద్‌బాబును మంగళవారం కలిశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ఇన్‌సర్వీస్ టీచర్లు బీఈడీ, బీపీఈడీ కోర్సులు చేసుకోవడానికి అనుమతిస్తూ జీఓ342 ఇచ్చారన్నారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకున్న జిల్లాకు చెంది న పలువురి దరఖాస్తులను తిరస్కరించారన్నారు. ముందే అనుమతి తీసుకోవడం తెలియక ఆందోళన చెందుతున్న ఆ ఉద్యోగులు ఉన్నత కోర్సులు చదవడానికి అనుమతి ఇవ్వాలని డీఈఓకు వినతి పత్రం అందజేశారు.

శభాష్

● చీమలవాగుపల్లి విద్యార్థులకు కలెక్టర్ అభినందన

అనంతపురం విద్య, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): 'విద్యార్థులూ.. వెరీగుడ్. ఇదే స్ఫూర్తితో ముందుకసాగండి. మావంతు సహకారం అందిస్తాం' అంటూ కలెక్టర్ ఆనంద్ భరోసా ఇచ్చారు. స్కూల్ ఇన్నొవేషన్ మారథాన్ -సైన్స్‌ప్రాజెక్టుల ప్రదర్శనలో పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన సౌరశక్తితో నడిచే పిచికారీ యంత్రం ప్రాజెక్టుకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. ఈనేపథ్యంలో మంగళవారం ఆ పాఠశాల విద్యార్థులు ప్రవల్లిక, కల్యాణి, షబానాలను డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ శైలజ కలెక్టరు ఆనంద్ వద్దకు తీసుకెళ్లారు. దీంతో కలెక్టర్ ఆ విద్యార్థులను ఆప్యాయంగా పలుకరించారు. అనంతరం వారు తయారు చేసిన ప్రాజెక్టు వివరాలను ఆరా తీసి అభినందించారు.

ఉపాధి కల్పించాలి

అనంతపురంరూరల్: టీటీడీసీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టి మరికొంత మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. పంగల్‌రోడ్డులోని టీటీడీసీ సెంటర్‌లో నిర్వహిస్తున్న స్కిల్ కాలేజ్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా కలెక్టర్ టీటీడీసీ పరిసరాలు, తరగతి గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సెంటర్‌లో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులతో



చీమలవాగుపల్లి విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ఆనంద్

మాట్లాడారు. శిక్షణ ఎలా ఉంది. భోజనం, వసతులు ఎలా ఉన్నాయనే వివరాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..శిక్షణ కాలంలో ఏకాగ్రత వహించి శిక్షణ తీసుకొని ఉపాధి పొంది స్వశక్తి మీద నిలబడి తల్లిదండ్రులకు బాసటగా నిలవాలన్నారు. కార్యక్రమం గురించి విద్యార్థులు తమ గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు తెలియజేయాలన్నారు. అనంతరం ఆవరణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ సంస్థ పథక సంచాలకులు శైలజ, జాబ్ జిల్లా మేనేజర్ సూర్యనారాయణ, ఏపీఎం శ్రీనివాసులు, డిఎస్టిఓ ప్రతాప్‌రెడ్డి, సిడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్ల వద్ద మత్తు విక్రయాలపై నిషేధం



తనిఖీలు చేస్తున్న డీఎస్పీ, పోలీసులు

అనంతపురం క్రైం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పరిసరాల్లో డ్రగ్స్, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు నిషేధమని అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్ పరిసరాల్లో ఆయన వన్‌టౌన్ సీఐ వెంకటేశ్వర్లు పోలీసులతో కలిసి మంగళవారం తనిఖీలు చేశారు. స్థానికంగా ఉన్న కిరాణా దుకాణాలు, చిన్న వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేశారు. పొగాకు ఉత్పత్తులు, గుట్కా పదార్థాలు, సిగరెట్లు అనుమతి లేకుండా విక్రయించరాదన్నారు. విద్యాసంస్థలకు సుమారు 100మీటర్ల పరిధిలో ఎలాంటి విక్రయాలు చేయరాదని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవన్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి: సీపీఐ

రాప్తాడు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను ఖండిస్తూ నియోజకవర్గ కార్యదర్శి రమేష్ అధ్యక్షతన మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్లికార్జున మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారం చేపట్టిన తర్వాత దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులు మితిమీరిపోయాయన్నారు.

దేశంలో మతోన్మాద పాలన సాగుతోందన్నారు. అణచివేత అంటరానితనం కుల, మత వివక్షత హింస పేట్రేగిపోతున్నాయన్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో 2023 ప్రకారం షెడ్యూల్డ్ కులాలపై జరిగిన నేరాలకు 57789 కేసులు, బి షెడ్యూల్ తెగల(ఎస్టీ)లపై జరిగిన నేరాలకు 12950 కేసులు, మహిళలపై 4.48 లక్షల నేరాలు నమోదవ్వడం విచారకరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రామకృష్ణ, నియోజకవర్గ



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

సహాయ కార్యదర్శి నీళ్లపాల రామకృష్ణ, మండల కార్యదర్శి ఆర్. రవీంద్ర, అనంతపురం రూరల్ మండల కార్యదర్శి జి. నరేష్, రైతు సంఘం నాయకులు నగేష్, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు రాకెట్ల రాము, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ధనుంజయ, కార్యదర్శులు రాజు, జీపీ ఓబిలేష్, కందుకూరు నల్లప్ప, ప్రసాద్, అక్కులప్ప, రెడ్డప్ప, యుగంధర్ రెడ్డి, నారాయణస్వామి తోపాటు వివిధ కాలనీల నాయకులు కుళ్లాయప్ప, విజయ్, నాగభూషణ, బాబు తదితరులు పాల్గొన్నారు.

నీలకంధరా.. దేవా..!

అనంతపురం టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో మంగళవారం లక్షదీపోత్సవం నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు దంపతులు లక్ష ఒత్తుల దీపాలను వెలిగించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ నరేంద్ర చౌదరి, ఈఓ నాగేంద్రుడు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరస్వామికి భక్తులు పంచామృతాభిషేకాలు, నవధాన్యాభిషేకాలు నిర్వహించారు. శంకరమఠంలో స్వామివారిని కుంకుమతో అభిషేకించారు. ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు.



మొదటి రోడ్డు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు దంపతులు



మూడోరోడ్డు షిర్డీసాయిబాబా ఆలయం వద్ద శివలింగాకృతిలో దీపాలు

ఎస్‌జీఎఫ్ ఖోఖో, అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఖోఖో, అథ్లెటిక్ క్రీడాకారులను ఎంపిక చేశారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక న్యూటౌన్ బాలుర ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్ 17, ఖో ఖో, అథ్లెటిక్ బాల, బాలికల క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఖో ఖో బాలికల జట్టుకు చైతన్య, శాంతి, శరణ్య, భార్గవి, ఉదయశ్రీ, చందన, యజ్ఞశ్రీ, జాహ్నప్రియ, కావ్యశ్రీ, ప్రవల్లిక, వర్షిణి, స్రవంతి ఎంపికయ్యారు. బాలుర జట్టుకు ఆంజనేయులు, నాగరాజు, గణేష్, చరణ్, లోహిత్‌రాజు, మహేంద్ర, సిద్ధార్థ, ప్రతాప్, నవదీప్, సాయి కుమార్, ధనుష్‌కుమార్, నవదీప్ కుమార్‌లు



ఎంపికైన ఎస్‌జీఎఫ్ ఖోఖో బాలికల జట్టు

ఎంపికయ్యారు. అథ్లెటిక్ బాలికల జట్టుకు 28మంది, బాలుర జట్టుకు 28మంది మొత్తం 56మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఎంపికైన ఖో ఖో, అథ్లెటిక్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సభ్యులు లక్ష్మీనారాయణ, సుహాసిని, పీడీలు ప్రభాకర్, రమేష్, మారుతీ, రాజశేఖర్ రెడ్డి, సురేష్, నిర్మల, శాంతలింగం, రాఘవేంద్ర, వెంకటేష్, జగన్‌మోహన్‌రెడ్డి, తిమ్మరాజు, శ్రీనివాసులు రెడ్డి, నారాయణ, లాల్‌బాషా, రామాంజినమ్మ, కళ్యాణి, అనురాధా, లీలారాణి తదితరులు పాల్గొన్నారు.

పరిటాల సునీత కార్తీక పూజలు



అమ్మవారి ఆలయంలో పరిటాల సునీత

రామగిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్వగ్రామం వెంకటాపురంలో గల యల్లమ్మ ఆలయంలో ఆమె కార్తీక మాసం ముగింపు సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద దీపాలు వెలిగించారు.

నేడు ప్యాదిండికి...

చెన్నేకొత్తపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి గ్రామానికి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం రానున్నారని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ రెండో విడత నిధులు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్న నేపథ్యంలో కార్యక్రమం ప్రారంభానికి ఎమ్మెల్యే హాజరవుతారని వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

8,688 మందికి పీఎం కిసాన్

శింగనమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో 8688 మంది రైతులకు బుధవారం పీఎం కిసాన్-అన్నదాత సుఖీ భవ ఆర్థికసాయం ఖాతాల్లోకి జమ కాను న్నట్లు ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. మొత్తం రూ.601 కోట్లు జమ అవుతుందన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి



మల్లికార్జున (ఫైల్)

అనంతపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని పాపంపేటకు చెందిన టీడీపీ కార్యకర్త మేకల మల్లికార్జున గౌడ్(41) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మల్లికార్జున గౌడ్ ఈనెల 15న ద్విచక్ర వాహనం నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి అనంతపురం సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య ఓబులమ్మ ఉన్నారు. టీడీపీ నాయకులు పాపంపేటకు వెళ్లి మల్లికార్జునగౌడ్ మృతదేహానికి నివాళులు అర్పించారు.

నషా ముక్త్ భారత్‌పై అవగాహన

అనంతపురంరూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ పై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ సరిత, డాక్టర్ కేవీ వెంకటేశ్వరావు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బాబాఫక్రుద్దీన్, భార్గవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

అనంతపురంరూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ అనుబంధ తైలసాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో రేకులకుంట గ్రామంలో మంగళవారం ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. సంస్థ సంచాలకులు జీవీ సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా స్థానికంగా వివిధ వృక్ష జాతులకు చెందిన వంద మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపినాథ్, సర్పంచు నరసమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లహరి తదితరులు పాల్గొన్నారు.

సుందరీకరణకు చర్యలు: శిల్పారామం సీఈఓ

అంతపురంరూరల్, నవంబరు18 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శిల్పారామంలో శాశ్వత సుందరీకరణకు దశలవారిగా మెరుగుపరచి అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ శిల్పారామం సీఈఓ స్వామి నాయుడు అన్నారు. ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన శిల్పారామంను తనిఖీ చేశారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిల్పారామంలో బోటింగ్, పార్కింగ్ కొరకు టెండర్లు ఇస్తామన్నారు. రెండు నెలలలోపు హ్యాండీక్రాఫ్ట్ మ్యూజియం పనులు, హ్యాండీక్రాఫ్ట్ సేల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లల కొరకు ఫన్ ఎక్విప్మెంట్, గేమ్‌జోన్స్ మరిన్ని తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో శిల్పారామం అసిస్టెంట్ ఇంజనీర్ యశ్వంత్, ఏఓ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్‌పై వరకట్నం కేసు

గుత్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నివాసముంటున్న సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ధనుంజయ, అతని తల్లిదండ్రులపై వరకట్నం కేసు నమోదైంది. గుత్తికి చెందిన డాక్టర్ ప్రియాంక అనంతపురం ఆదినగర్‌లోని పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి 2022 డిసెంబరులో వివాహమైంది. ఇటీవల కట్నం తీసుకురావాలని ధనుంజయ, అతని తల్లిదండ్రులు నగేషన్, రామతులసి వేధిస్తున్నారంటూ ప్రియాంక స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు

టీడీపీ కన్వీనర్లు ఖరారు..?



బుక్కరాయసముద్రం, నవంబరు18 (ఆంధ్రజ్యోతి): శింగనమల నియోజకవర్గం టీడీపీ మండల కన్వీనర్ల ఎంపికను పార్టీ అధిష్టానం ఖరారు చేసినట్లు సమాచారం. మూడు రోజుల క్రితం అనంతపురంలో నియోజకవర్గం పార్టీ ప్రత్యేక పరిశీలకులు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, ఏడీసీసీబీ చైర్మన్ ముంటి మడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఆరు మండలాల పార్టీ పరిశీలకులు భేటీ అయ్యి కమిటీ ఎంపికపై సుదీర్ఘంగా చర్చించిన విషయం తెలిసిందే. ఇందులో కన్వీనర్ పదవికి పోటీలో ఉన్న ఆశావహులను పిలిపించి మాట్లాడారు. కొన్ని మండలాల నుంచి పోటీ తీవ్రంగా ఉండటం వలన ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఐవీఆర్ఎస్ ద్వారా కన్వీనర్లను ఎంపిక చేయాలని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రెండు రోజుల నుంచి బుక్కరాయసముద్రం మండలంలో లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య, నార్పల మండలం కుళ్లాయప్ప, ప్రతాప్, శింగనమల మండలం మారుతీనాయుడు, అనిల్ యాదవ్, పుట్లూరు మండలం కులశేఖర్‌రెడ్డి, ఓబుళాపురం శీనా, సుదర్శన్‌నాయుడు గురించి ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయాలు సేకరించారు. మెజార్టీ మేరకు కన్వీనర్ల ఎంపిక ఉంటుంది.

ఎంపికైన జాబితా ఇదే..

బుక్కరాయసముద్రం మండలం నుంచి లక్ష్మీనారాయణ, నార్పల మండలం కుళ్లాయప్ప, శింగనమల మారుతీనాయుడు, పుట్లూరు ఓబుళాపురం శీనా పేర్లు కన్వీనర్లుగా ఖరారైనట్లు సమాచారం. ఈ విషయంపై నియోజకవర్గం పార్టీ పరిశీలకులు పర్వీన్‌తాజ్‌ను వివరణ కోరగా నాలుగు మండలాల నుంచి పైజాబితా ఖరారు చేసిన విషయం తెలిసిందేనన్నారు. గార్లదిన్నె, యల్లనూరు మండలాలకు సంబంధించి పాండు, రామాంజినేయులు పేర్లను కూడా ఐవీఆర్ఎస్ ద్వారా ప్రతిపాదన చేస్తారా? లేక ఆమోదం వేస్తారా? అన్న విషయం ఇంకా ఖరారు చేయలేదన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే, టూమెన్ కమిటీ సభ్యులు, పార్టీ పరిశీలకులు కన్వీనర్ల పేర్లను బుధవారం ప్రకటిస్తారన్నారు.

నేటి నుంచి ప్రపంచ వారసత్వ వారోత్సవాలు



పురాతన కారాగారాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్/టౌన్, నవంబరు18(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ వారోత్సవాలు బుధవారం నుంచి ఈనెల 25వతేదీ వరకు నిర్వహించనున్నట్లు అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, పురావస్తు శాఖ ఏడీ స్వామినాయక్ తెలిపారు. అందుకు సన్నాహాల్లో భాగంగా మంగళవారం స్థానిక టవర్‌క్లాక్ సమీపంలోని పురాతన కారాగారాన్ని ఆయన పరిశీలించారు. కారాగారంలో పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలను శుభ్రం చేయించారు. పురాతన కట్టడాలను వారసత్వంగా భద్రపరిచి, ప్రజలకు తెలియజేయడమే వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని కమిషనర్ తెలిపారు. ఏఎంసీ డిప్యూటీ కమిషనర్ పావని, ఈఈ షాకీర్, డీఈ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

అణగారిన వర్గాలపై దాడులను అరికట్టాలి

సీపీఐ నాయకుడు నారాయణస్వామి



తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నిరసన

గార్లదిన్నె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఐ జిల్లా నాయకులు నారాయణ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై అనేక చోట్ల దాడులు జరుగుతున్నాయన్నారు. వారిపై జరుగుతున్న దాడులను ఆరికట్టడంతో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ధ్వజమెత్తారు. ముఖ్యంగా పదేళ్ల నుంచి నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రభుత్వాలు హామలు ఇవ్వడం తప్ప నేరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస నష్టాలతో రైతులు వ్యవసాయం మానేసి భూములను అమ్ముకుంటున్నారని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ ఈరమ్మకు అందచేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు శ్రీనాథ్‌చౌదరి, సీపీఐ మండల కార్యదర్శి రాముడు, సహాయ కార్యదర్శి వన్నూర్‌స్వామి, కిష్ట, నల్లప్ప, నరేంద్ర, జగన్నాథ్, అంజినమ్మ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలి: ఏఐఎస్ఎఫ్

అనంతపురం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆమేరకు మంగళవారం వర్సిటీలో అందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు వేమన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా బయట వ్యక్తులను కాంట్రాక్టు పద్ధతిలో ఈ రెండు కళాశాలలకు ప్రిన్సిపాళ్లుగా నియమిస్తున్నారన్నారు. ఎంత మంది వీసీలు మారినా రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను మాత్రం నియమించడం లేదన్నారు. సంబంధిత విభాగాల్లోని ప్రొఫెసర్లను రెగ్యులర్ ప్రిన్సిపాళ్లుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాలకృష్ణ, ఉపాధ్యక్షులు భీమేష్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు జయచంద్ర, నాయకులు ఖాసీం, వినోద్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు సాధికారిత సాధించాలి

ఆత్మకూరు నవంబరు 18(ఆంధ్రజ్యోతి):మహిళలు సాధికారత సాధించడమే పీఏసీ లక్ష్యమని పి.యాలేరు సొసైటీ చైర్మన్ క్రిష్ణమోహన్ పేర్కొన్నారు. స్థానిక సొసైటీలో మంగళవారం 72వ అఖిలభారత సహకార వారోత్సవాల సందర్భంగా జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారత అంశంపై పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్‌లు బొమ్మయ్యనారాయణ,మానిటరింగ్ అధికారి సుదీర్,అహమ్మద్, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ స్టీవిన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

రాప్తాడు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): గార్లదిన్నెలో ఈనెల 27,28వ తేదీల్లో నిర్వహించే రైతు సంఘం జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం మండల కార్యదర్శి పోతులయ్య, జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, పెద్దన్న, మారెప్ప, అందినరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. సభల్లో జిల్లాలోని రైతాంగ సమస్యలపై తీర్మానాలు ఆమోదించడంతో పాటు నూతన కమిటీ ఎన్నిక ఉంటుందన్నారు. 27న గార్లదిన్నెలో నిర్వహించే భారీ బహిరంగ సభకు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాంభూపాల్ హాజరవుతారన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలించాలి

శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి

శింగనమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు లేని నియోజకవర్గంగా శింగనమలను తీర్చిదిద్దుదామని, ఇందుకు అందరి సహకారం కావాలని ఎమ్మెల్యే బండారు శ్రావణి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఐసీడీఎస్ డైరెక్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో బాల్యవివాహ నిరోధక అధికారులు, సర్పంచులకు బాల్యవివాహాల నిర్మూలనపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా గ్రామాల్లో నేటికీ బాల్య వివాహాలు జరుగుతుండటం దురదృష్టకరమన్నారు. అందుకే అధికారులతో ఎప్పటికప్పుడు గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు పోతున్నట్లు పేర్కొన్నారు. ఐసీడీఎస్ డైరెక్టర్ అరుణకుమారి మాట్లాడుతూ అందరి సహకారంతో బాల్య వివాహాల నిరోధానికి కృషి చేస్తామన్నారు. శక్తి, మిషన్ వాత్సల్య పథకం ద్వారా బాలలు, మహిళలకు అనేక సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ కోర్డినేటర్ శ్రీదేవి, సీడీపీఓలు చల్లా లిలితమ్మ భారతి, చెల్డ్ హెల్ప్ జిల్లా కోర్డినేటర్ కృష్ణమాచారి, మార్కెట్ యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు, మారుతీనాయుడు, ఎం.ఆదినారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ, డేగలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆ పూజారి మాకొద్దు

శింగనమల దుర్గాంజనేయస్వామి పూజారిని తొలగించాలని పలువురు గ్రామస్థులు ఎమ్మెల్యే బండారు శ్రావణికి మంగళవారం ఫిర్యాదు చేశారు. వైసీపీ సానుభూతిపరుడైన పూజారి తరచూ భక్తులపై కస్సుబుస్సులాడుతాడని ఆమెకు తెలిపారు. శింగనమలకు వచ్చిన ఎమ్మెల్యేకి ఈ విషయమై వారు వినతిపత్రం అందజేశారు. నూతన కమిటీకి ఆలయ తాళాలు ఇవ్వకుండా, ఆలయం జోలికి వస్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరిస్తున్నాడని తెలిపారు. రాచేపల్లి వద్ద నిరూపయోగంగా ఉన్న మినీ లెదర్ పరిశ్రమను ప్రారంభించాలని సీపీఎం నాయకులు కోరారు. మిడ్ పెన్నార్ చివరి ఆయకట్టు సలకం చెరువు చెరువుకు నీరు ఇవ్వాలని సీపీఎం నాయకులు భాస్కర్ వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు సూర్యప్రకాశ్ నియోజకవర్గంలోని పాఠశాల సమస్యలను పరిష్కరించాలని కోరారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

న్యూస్ బాక్స్

గృహ మంజూరు పత్రాల అందజేత



గృహ మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద పట్టణంలో దాదాపు 373 మందికి గృహాలు మంజూరైనట్లు ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి తెలిపారు. స్థానిక నందలపాడు, రైల్వేస్టేషన్ వార్డుల్లో దాదాపు 30 మందికి ఇళ్లు మంజూరు కాగా.. లబ్ధిదారులకు ఆ ప్రతాలను మంగళవారం అందజేసిన ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలో అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్ అరుణ, వైస్ ఛైర్మన్ షెక్షావలి, కౌన్సిలర్లు విజ్జి, మల్లికార్జున, సింగిల్ విండో అధ్యక్షుడు చిట్టిబాబు పాల్గొన్నారు.

● రోడ్డు పనుల పరిశీలన

పెద్దపప్పూరు : ముచ్చుకోట గ్రామసమీపాన ఎన్‌హెచ్ 544డీ రోడ్డు పనులను మెగా గ్రూప్స్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, టీడీపీ యువనాయకుడు జేసీ పవన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. వారి వెంట తాడిపత్రి తహసీల్దార్ సోమశేఖర్, ఎస్ఐ ధరణీబాబు, మండల కన్వీనర్ తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సందీప్, హారిక

కూడేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలో కూడేరు మండలం కమ్మూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న హారిక, బేస్‌బాల్ పోటీలో సందీప్ సత్తా చాటారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ హిమబిందు మంగళవారం తెలిపారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన వేపరాల పాఠశాల విద్యార్థులు

● రాయదుర్గంరూరల్ : మండలంలోని వేపరాల ఉన్నత పాఠశాల విద్యార్థులు లావణ్య, అమృత, విజయ్, చైత్ర, భరత్ ఈ నెల 4న అనంతపురంలో నిర్వహించిన జిల్లాస్థాయి నెట్‌బాల్ పోటీలో ప్రతిభచాటారు. ఈ నెల 27న వెస్ట్‌గోదావరిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటున్నట్లు హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, పీఈటీలు వీరేష్, ఈశ్వర్‌రెడ్డి మంగళవారం తెలిపారు.

● అక్కాచెల్లెళ్ల ప్రతిభ



ఎంపికైన అక్కాచెల్లెలు

గుంతకల్లు : ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో ప్రతిభను చాటిన అక్కాచెల్లెలు రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు మంగళవారం ఎంపికయ్యారు. స్థానిక ఎస్ఎస్‌జీఎస్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఏ ఇంద్రలేఖ అండర్-19 200, 400 మీటర్ల విభాగంలో జిల్లా మొదటి స్థానాన్ని సాధించింది. అలాగే మండలంలోని ఎన్ నరసాపురం ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఇంద్రలేఖ చెల్లెలు ఏ వర్షిత అండర్-17 800, 1500 మీటర్ల విభాగంలో జిల్లా మొదటి స్థానం సాధించింది. ఈ అక్కాచెల్లెలు ఈ నెల 24, 25, 26 తేదీల్లో గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎన్ నరసాపురం ఉన్నత పాఠశాల పీడీ చల్లా ఓబులేశు తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మట్టిని వేయిస్తున్న నాయకులు

పామిడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్ నుంచి సీఎస్ఐ చర్చి వరకూ మట్టి రోడ్డు గుంతలమయం కావడంతో విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. గుత్తి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కొట్టం మాలిక్‌బాషా తన సొంత డబ్బుతో మంగళవారం ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

పంచాయతీ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

యాడికి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): యాడికిలోని చెన్నకేశవస్వామి ఆలయం వెనుక ఉన్న గ్రామ పంచాయతీ స్థలాన్ని కబ్జా చేశారని , దాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ ఎంపీడీఓ శశికళకు స్థానికులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గ్రామపంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి ఆక్రమణదారులపై తగు చర్యలు చేపట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో హాజీబాషా, రవి, శివ ఉన్నారు.

సింగరప్ప కొండపై కార్తీక వనభోజనాలు

పామిడి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పామిడి పెన్నానది ఒడ్డున సింగరప్పకొండపై మంగళవారం భావసార క్షత్రియులు కార్తీక వనభోజనాలు చేపట్టారు. స్థానిక రంగసుబే ఫిర్కా భగవాన్‌దాస్ విఠోబస్వామి దేవాలయం నుంచి నారాయణస్వామి(సంతమార్కెట్)వీధిలోని అశ్వర్థ నారాయణస్వామి ఆలయం వరకూ భజనలు చేసుకుంటూ వెళ్లారు. అనంతరం కొండపై సింగరప్ప ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేపట్టారు.

మట్టి తవ్వకాలకు బ్రేక్..!

బొమ్మనహాళ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి):ఆంధ్రా సరిహద్దు బొమ్మనహాళ్ సమీపంలో తుంగభద్ర ఎగువ కాలువకు అతి సమీపంలో మట్టితవ్వకాలు చేపట్టారు. దీని ద్వారా కాలువకు ప్రమాదం పొంచి ఉందని పలు పత్రికలు కథనాలు ప్రచురించాయి. దీంతో హెచ్చెల్సీ ఎఈఈలు రంజిత్, ఆల్తాఫ్, సిబ్బంది ఆ తవ్వకాలను మంగళవారం పరిశీలించి.. ఇకపై మట్టి తవ్వకాలు చేయరాదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆ గుంతలను వెంటనే పూడ్చేలా చర్యలు తీసుకున్నారు.

అనుమతులతోనే క్వారీ నిర్వహణ

శెట్టూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాటకల్లు గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 185లో క్వారీ నిర్వహణకు పూర్తిగా ప్రభుత్వ అనుమతులు ఉన్నాయని తహసీల్దార్ ఈశ్వరమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం గ్రీవెన్స్‌డేలో మాజీ ఎంపీ తలారి రంగయ్య ఇచ్చిన ఫిర్యాదుపై ఆమె ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అన్నిఅనుమతులు పొందిన తరువాతనే ఎస్‌ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దేవినేని వెంకటేశులు స్టోన్ క్రషింగ్ పనులు చేపట్టారన్నారు.

బీపీఎస్ పునరుద్ధరణ

పట్టణ ప్రజలకు ప్రభుత్వం బంపర్ ఆఫర్



గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం

గుంతకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిర్మించిన భవనాలను అపరాధ రుసుముతో రెగ్యులరైజ్ చేసే బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం)ను రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించింది. ఈ స్కీంను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. 2024 ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం మొదట అక్రమ లే-ఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు లే-ఔట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను ప్రారంభించింది. బీపీఎస్ పథకాన్ని పునరుద్ధరించలేదు. దీంతో పలు చోట్ల అక్రమ భవనాలను కూల్చడం, నోటీసులను జారీ చేయడం జరిగింది. దీనిపై పట్టణ ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్న తరుణంలో ప్రభుత్వం బీపీఎస్‌ను పునరుద్ధరిస్తూ బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది.

● నాలుగు నెలలే గడువు: అనధికారికంగా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలను రెగ్యులరైజ్ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం బీపీఎస్ పునరుద్ధరిస్తూ.. ఈనెల 12వ తేదీన ఉత్తర్వును జారీ చేసింది. ఆ తేదీ నుంచి 120 రోజుల లోపల భవనాల రెగ్యులరైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని గడువు విధించింది. 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీపీఎస్.జీఓవీ.ఇన్' ఆన్‌లైన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని మునిసిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు. లైసెన్సుడు టెక్నికల్ పర్సన్ల ద్వారా దరఖాస్తులను ప్రాసెస్ చేయించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అందుకు రిజిస్ట్రేషన్ దస్తావేజులు, సెల్ఫ్ డిక్లరేషన్, సబ్ రిజిస్ట్రార్లు జారీచేసిన ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, మార్కెట్ విలువ సర్టిఫికెట్లతోపాటు భవన నిర్మాణ ప్లాన్‌ను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బిల్డప్ ఏరియా, సైట్ ప్లాన్ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. వీటికి తోడుగా మరికొన్ని డాక్యుమెంట్లను జతచేయాల్సి ఉంటుంది.

● నిబంధనలివీ..: బిల్డింగ్ పీనలైజేషన్ స్కీం కింద ప్రభుత్వం కొన్ని నిబంధనలు విధించింది. 2025 ఆగస్టు 31 తేదీకి ముందు నిర్మించిన ఇళ్లకు మాత్రమే బీపీఎస్ వర్తిస్తుంది. అనధికారికంగా నిర్మించుకున్న పై అంతస్తులకు గడుగుల లెక్కన పీనలైజేషన్ విధించడం జరుగుతుందన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు జారీచేసే భవన మార్కెట్ విలువ ఆధారంగా అపరాధ రుసుమును విధిస్తారు. నోటిఫైడ్ స్లమ్స్ (గుర్తింపు పొందిన మురికివాడల్లో) ఉన్న ఇళ్లకు అపరాధ రుసుములో 50 శాతం తగ్గింపు ఉంటుంది. 1997 డిసెంబరు 31 తేదీకి మునుపు నిర్మించిన భవనాల అపరాధ రుసుములో 25 శాతం మినహాయింపును ఇస్తారు. 2025 ఆగస్టు 31 తేదీ తర్వాత నిర్మించిన భవనాలకు బీపీఎస్ వర్తించదు. అలాగే 60 గజాల లోపు ఉండే ఇళ్ల నిర్మాణాలకు, బీపీఎల్ కింద ప్రభుత్వ స్థలంలో ఇళ్లను నిర్మించుకున్నవారికి ఇందులో మినహాయింపు ఉంటుంది.

అవకాశాన్ని వినియోగించుకోండి: నయీం అహ్మద్, గుంతకల్లు మున్సిపల్ కమిషనర్

ప్రభుత్వం బీపీఎస్‌ను పునరుద్ధరించడం ఒక వరంలాంటిది. అనుమతులు లేకుండా అక్రమంగా, అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చివేయడం జరుగుతున్న తరుణంలో ప్రభుత్వం ప్రజలకు ఓ అద్భుత అవకాశాన్ని ఇచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. అలాగే అక్రమ లే-ఔట్లు, స్థలాల రెగ్యులరైజేషన్ స్కీం (ఎస్ఆర్ఎస్)కు అతి త్వరలో గడువు తీరిపోనుంది. 2026 జనవరి 23 తేదీ వరకూ మాత్రమే ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తులను స్వీకరిస్తాము. ఆ తర్వాత స్కీం రద్దయితే ప్లాట్లను, ఖాళీ స్థలాలను అమ్మడం, కొనడం సాధ్యపడదు. వాటిలో ఇళ్లను నిర్మించుకోవడానికి మునిసిపాలిటీ ప్లాన్ అప్రూవల్ ఇవ్వదు. కనుక ప్రజలు త్వరపడాలి.

ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతిపై నిరసన

ఉన్నతాధికారులకూ వాటాలివ్వాలన్న ఉద్యోగి



ఫీల్డ్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న లబ్ధిదారుడు

విడపనకల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటి బిల్లు మంజూరు చేయడానికి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ జీ సురేష్ రూ. రెండు వేలు డిమాండ్ చేస్తున్నాడంటూ బళ్లారి సుశీల, బళ్లారి రాముడు, సరస్వతి వాపోయారు. ఈ మేరకు వారు టీడీపీ నాయకులతో కలిసి మంగళవారం సచివాలయం వద్ద నిరసన చేశారు. తాము రూ. 1500 ఇచ్చినా బిల్లులు మంజూరు చేయలేదన్నారు. దీంతో అధికారులు ఫీల్డ్ అసిస్టెంట్‌ను సచివాలయానికి పిలిపించి విచారించారు. 'నేను ఒక్కడినే తినేందుకు తీసుకోలేదు. బిల్లులు మంజూరు కావాలంటే కింది స్థాయి నుంచి పై స్థాయి అధికారి వరకూ ఇవ్వాల్సిందే. ఈసీ వసూళ్లు చేసి ఇవ్వమంటేనే నేను వసూళ్లు చేసి ఇచ్చాను.' అని సురేష్ బహిరంగంగా స్పష్టం చేశాడు. దీంతో వెంటనే సచివాలయ సిబ్బంది ఉపాధి హామీ ఈసీకి ఫోన్ చేసి విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఈసీ గురు ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను 'నేను నీకు డబ్బులు వసూళ్లు చేయమని చెప్పానా? వసూళ్లు చేసి ఎవరికి ఇచ్చావు..' అంటూ సెల్‌ఫోన్‌లోనే నిలదీశాడు. దీంతో సురేష్ వెంటనే మాట మార్చి..' నాకు ఎవ్వరు డబ్బులు వసూళ్లు చేయమని చెప్పలేదు.. నేనే వసూళ్లు చేసుకుని నా వద్దనే ఉంచుకున్నాను' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీనిపై ఉపాధి హామీ అధికారులు మాట్లాడుతూ.. ఇళ్లకు ఉపాధి బిల్లులు మంజూరుకు ఎవ్వరికి ఒక్క రూపాయి ఇవ్వాల్సిన పనిలేదని, అందిరి బిల్లులు పెట్టామని, విడతలు వారిగా బిల్లులు జమ అవుతాయన్నారు.

విద్యార్థులకు సైక్లింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న గుమ్మనూరు నారాయణస్వామి

గుంతకల్లు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్ తిమ్మాపురం వద్ద జిల్లా సైక్లింగ్ అసోసియేషన్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్-14, అండర్-17 సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. వీటిని టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ స్వామి ప్రారంభించారు. ఈ పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో రాహుల్ (వజ్రకరూరు), శివ (వజ్రకరూరు), ఎల్ శ్రీధర్ (గడేకల్లు), వీ శ్రవణ్ (కొనకొండ్ల), అండర్-17 బాలికల విభాగంలో ఏ సంజన (కొనకొండ్ల), ప్రణతి (గడేకల్లు), అపూర్వ (గుంతకల్లు), బీ షణ్ముఖ ప్రియ (గడేకల్లు) ప్రతిభ చాటారు. అలాగే అండర్-14 బాలుర విభాగంలో బీ మనోజ్ (కొనకొండ్ల) ఎం శివశంకర్ (గడేకల్లు), దినేశ్ సాయి (వజ్రకరూరు), ఆర్ లిఖిత్‌నాయక్ (వజ్రకరూరు), అండర్-14 బాలికల విభాగంలో ఖాజాబీ (గుంతకల్లు), షబీనా (వజ్రకరూరు), పీ నిత్యశ్రీ (గడేకల్లు), జీ జయశ్రీ (కొనకొండ్ల) పోటీల్లో ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో గుంతకల్లు సింగిల్ విండో సొసైటీ ఛైర్మన్ తలారి మస్తానప్ప, టీడీపీ నాయకులు శివన్న, రామప్ప పాల్గొన్నారు.

కాలువల మరమ్మతులకు శ్రీకారం

గుమ్మఘట్ట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బీటీ ప్రాజెక్ట్ ఎడమకాలువ పరిధిలోని ఆయకట్టు కాలువలకు మరమ్మతులు చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. మంగళవారం కలుగోడు పరిధిలోని ఎడమకాలువ తొమ్మిదో డిస్ట్రిబ్యూటరీ మరమ్మతు పనులను బీటీ ప్రాజెక్ట్ ఛైర్మన్ కాలవ నాగరాజు భూమిపూజ చేశారు. రబీసీజన్‌లో ఎడమకాలవ ఆయకట్టుకు డిసెంబరు మొదటి వారంలో సాగునీరు విడుదల చేయనున్న నేపథ్యంలో ఈ పనులు చేపట్టారు. ఇందులో ఇరిగేషన్ డీఈ గీతాలక్ష్మి, ఏఈ హరీష్, సింగల్ విండో అధ్యక్షులు నీరగంటి తిమ్మప్ప, దేవరాజ్, చెన్నప్ప, అంజి పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ప్రాజెక్ట్ ఛైర్మన్



నిరసన తెలుపుతున్న ఆర్టీఏ సభ్యులు

ఆర్టీఏపై అధికారుల నిర్లక్ష్యానికి నిరసన

కుందుర్పి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాము ఆరు నెలలుగా సమాచార హక్కు చట్టం కింద కోరిన సమాచారాన్ని ఇవ్వకుండా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తోందని సూర్యోదయ సమాచార హక్కు చట్టం పరిరక్షణ సమితి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఆర్టీఏ చట్టం గౌరవాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ తమ దరఖాస్తులను తిరస్కరిస్తూ పారదర్శకత జవాబుదారీతనం తుంగలో తొక్కుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ నాయకులు శివలింగప్ప హరిదాసులు, శామ్యూల్, ఆర్టీఏ సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘం వారోత్సవాలు



ఉద్దేహాళ్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఛైర్మన్ మల్లికార్జున

బొమ్మనహాళ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్‌లో 72వ అఖిల భారత సహకార సంఘం వారోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. జెండాను ఆవిష్కరించిన సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి మల్లికార్జున మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో సొసైటీలు పూర్తిగా నిర్వీర్యం అయ్యాయని.. కూటమి ప్రభుత్వం రాకతో వాటికి పూర్వ వైభవం సంతరించుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యానిటరింగ్ అధికారి పవన్‌కుమార్, సీఈఓ హనుమంత, డైరెక్టర్ లేపాక్షి, టీడీపీ నాయకులు నవీన్, నల్లాపురం బాబు, నాగరాజు, సంగప్ప, సైకిల్ షాప్ హనుమంత, ఎంఆర్పీ మల్లన్న పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



ప్రసంగిస్తున్న విరజానందస్వామి, పాల్గొన్న భక్తులు

యాడికి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలచెరువులో మాణిక్య సీతారామస్వామి, చెన్నకేశవస్వామికి కార్తీక మాసం స్వాతి నక్షత్రం సందర్భంగా మంగళవారం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. బ్రహ్మంగారి మఠం అచలానంద పీఠాధిపతి విరజానందస్వామి భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్యక్రమంలో ఆ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రాయలసీమ నామకరణ దినోత్సవం



కేక్ కట్‌చేస్తున్న ఉద్యమకారులు

తాడిపత్రి, నవంబరు18(ఆంధ్రజ్యోతి): రాయలసీమ నామకరణ దినోత్సవం సందర్భంగా యల్లనూరు రోడ్డు రఫ్ కార్యాలయంలో రాయలసీమ ఉద్యమనేత తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో రాయలసీమ ఉద్యమకారులు పుట్లూరు భాస్కర్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, నాగరాజు, ఖాదర్, ఇబ్రహీం, రామాంజనేయులు, చింబిలి బాబ్జినాయుడు, సూర్యప్రతాప్‌రెడ్డి, నూర్ మహమ్మద్ పాల్గొన్నారు.



రాయదుర్గం మండలం మల్లాపురం గ్రామంలోని విప్రమలై లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు



గుత్తి మండలం తొండపాడులోని బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో జ్వాలాతోరణం నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

క్రైం న్యూస్..

ఆర్థిక ఇబ్బందులతో వృద్ధుడి ఆత్మహత్య

కళ్యాణదుర్గం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదిగల్లు గ్రామానికి చెందిన లక్ష్మన్న (60) ఆర్థిక ఇబ్బందులతో మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. లక్ష్మన్న కుటుంబ పోషణ కోసం సుమారు రూ. ఐదు లక్షలు అప్పులు చేశాడు. ఆ అప్పులు తీర్చలేక మానసిక క్షోభ అనుభవించేవాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతను ఊరి బయటకు వెళ్లి.. పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో పడివున్న అతన్ని స్థానికులు గుర్తించి.. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలికి చేరుకొని పరిశీలించగా.. అప్పడికే లక్ష్మన్న మరణించినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పట్టణ పోలీసులు కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా, లక్ష్మన్నకు భార్య నాగమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హెచ్చెల్సీలో జారిపడి టీడీపీ కార్యకర్త మృతి



తిప్పేస్వామి (ఫైల్)

కణేకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక నేసేపేటకు చెందిన టీడీపీ కార్యకర్త తిప్పేస్వామి (30) మూడురోజుల క్రితం హెచ్చెల్సీ కాలువలో ప్రమాదశాత్తు కాలుజారిపడి.. మంగళవారం శవమై తేలారు. తిప్పేస్వామి టైలర్ పనులతో పాటు వ్యవసాయపనులు చేసుకునేవాడు. ఆదివారం హెచ్చెల్సీ వద్దకు వెళ్లిన అతను ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరూ గమనించలేదు. తిప్పేస్వామి కనిపించడం లేదని అతని కుటుంబసభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం హెచ్చెల్సీలో ఒక వ్యక్తి మృతదేహం కనిపించగా.. పోలీసులు దాన్ని వెలికి తీశారు. అది తిప్పేస్వామి మృతదేహమే అని అతని కుటుంబసభ్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. తిప్పేస్వామికి భార్య, ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. పలువురు టీడీపీ నాయకులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...



పెద్దన్న (ఫైల్)

కూడేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కూడేరు సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక దళితవాడకు చెందిన నాగమ్మ, బాట మారెన్న కుమారుడు, టీడీపీ కార్యకర్త బాట పెద్దన్న (22) అక్కడికక్కడే మరణించాడు. పెద్దన్న, ఇటిగౌని శ్రీకాంత్ ముద్దలాపురం గ్రామ సమీపంలోని సుజలాన్ ఫ్యాక్టరీలో పని చేస్తున్నారు. సోమవారం అర్ధరాత్రి పని ముగించుకొని వీరు ద్విచక్ర వాహనంలో కూడేరుకు వస్తుండగా.. ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో బాట పెద్దన్న అక్కడికక్కడే మరణించాడు. శ్రీకాంత్‌కు గాయాలయ్యాయి. అలాగే రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న భాస్కర్‌ను కూడా అదే కారు ఢీకొనడంతో అతనూ గాయపడ్డాడు. వీరిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దన్న మృతదేహాన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తులో ఉందని ఏఎస్ఐ రామానాయుడు తెలిపారు.

చికిత్స పొందుతూ...

విడపనకల్లు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని హావళిగి గ్రామానికి చెందిన భూమా హనుమంతు కుమారుడు భూమా ప్రతాప్ (22) బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడు. ప్రతాప్ ఆదివారం తమ పొలంలో మిరప పంటకు మందు పిచికారి చేశాడు. అనంతరం తనకు బాగలేదని కుటుంబ సభ్యులకు తెలపడంతో వారు వెంటనే గ్రామంలోని ఓ ఆర్ఎంపీ వైద్యునితో ప్రథమ చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించాడు. పాల్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలోని 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గొందిపల్లి గ్రామానికి చెందిన ఓబులేసు, కంబగిరిస్వామి ఆటోలో వెళ్తుండగా.. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం గుడిపాడుకు చెందిన గోపాల్‌రెడ్డి బైక్‌పై వచ్చి ఢీకొన్నాడు. ఆటో బోల్తా పడటంతో ఈ ముగ్గురూ గాయపడ్డారు. వీరిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఓబులేసును అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ప్రొఫెసర్‌పై వరకట్నం కేసు

గుత్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో నివాసముంటున్న సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ధనుంజయ, అతని తల్లిదండ్రులపై వరకట్నం కేసు నమోదైంది. గుత్తికి చెందిన డాక్టర్ ప్రియాంక అనంతపురం ఆదినగర్‌లోని పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరికి 2022 డిసెంబరులో వివాహమైంది. ఇటీవల కట్నం తీసుకురావాలని ధనుంజయ, అతని తల్లిదండ్రులు నగేష్, రామతులసి తనను వేధిస్తున్నారంటూ ప్రియాంక స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆ ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేలం పాటలో వాగ్వాదం



కాంట్రాక్టర్, జేఏ వాగ్వాదం

ఉరవకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం తలనీలాలు, సప్లయ్ సామాన్లు సేకరణకు సంబంధించిన వేలం పాటలో గందరగోళం చోటు చేసుకుంది. మూడోసారి నిర్వహించిన ఈ వేలం పాట వాయిదా పడింది. దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించిన కోడ్ కంటే తక్కువ ధరకే పాడడంతో వాటిని రద్దు చేసినట్లు ఇన్‌చార్జీ ఈఓ తిరుమల రెడ్డి తెలిపారు. గతంలో తలనీలాలు వేలం పాటలో పోగు చేసిన వెంట్రుకలు తనవే అంటూ మారెన్న అనే వ్యక్తి ఇన్‌చార్జీ ఈవో తిరుమల రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కావు.. అవి ఆలయానికి సంబంధించినవని జూనియర్ అసిస్టెంట్ మారుతి పేర్కొన్నారు. దీంతో వారి మధ్య వాగ్వివాదం జరిగింది. తలనీలాలను పోగు చేసుకునే హక్కుకు సంబంధించి కాలపరిమితి ఉందని, తన కాల పరిధిలో పోగు చేసుకున్న వెంట్రుకలు ఎక్కడకు పోయాయని కాంట్రాక్టర్ నిలదీశారు. ఆయనకు అధికారులు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

రాయదుర్గంరూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో పీఎంకేవీవై 0.4లో భాగంగా సిల్క్‌హబ్‌సెంటర్‌లో మూడు నెలలు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్లికేషన్ డెవలపర్ వెబ్ అండ్ మొబైల్, సోషల్ మీడియా, ఎగ్జిక్యూటివ్ కోర్సులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ, ఎంకాం పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ నెల 22వ తేదీలోగా పాలిటెక్నిక్ కళాశాలలో సిల్క్‌హబ్‌సెంటర్ నందు రిజిష్టర్ చేసుకోవాలని, వివరాలకు 7801031771 నంబరులో సంప్రదించాలని సూచించారు.